వాఙ్మయ పరిశీలన

# నేటి హోటళ్లు : నాటి అట్టశాలములు

కోట వెంకటేశ్వరశాస్త్రి

ఈనాడు క్రొత్త ఊళ్ళో కాలుపెట్టగానే యే హోటలుకు పోదామనేది ఒకసమస్య. భోజనమునకు నివాసమునకు ఉపహారమునకు అనువైన హోటలునే చూచుకొంటాము. ఈ "హోటలు" ఎప్పటినుండి వాఙ్మయాని కెక్కింది అన్నదే నేటి ఆలోచన.

సంస్కృత వాఙ్మయంలోగాని, దాని ననుకరించుటయే ఘనమనుకున్న ప్రాచీనాంధ్ర వాఙ్మయంలోగాని ఈ "హోటలు"ను గూర్చిన వర్ణనలు గాని, తత్సంబంధమైన సంఘటనలుగాని బొత్తిగ లేవనలేముగాని చాలతక్కువ. అష్టాదశవర్ణనలు నోచిన నోముగాని, స్త్రీలునోచిన నోముగాని, కనీసము వేశ్యలునోచినపాటి నోమునైనహోటలు నోచలేదు. అందుచే మనకు మనవాఙ్మయంలో, హోటలు, ఘోషాస్త్రీవలె, దర్శనమీయలేదు.

ప్రాచీన సంప్రదాయములను కాపాడు సంస్కృత పురాణములలో దోషములను చెప్పుచు అన్నవిక్రేతను మహాదోషిగాచెప్పి "అట్టశూలాం జనపదాః" అని కలియుగ ధర్మములో చెప్పియున్నారు. "అట్టశూల" శబ్దమునకు వివరణముగనొక వార్తికమును సృష్టించినారు. దానిలో అట్టశూల జ్ఞానము కలుగుచున్నది. "అట్ట మన్నమితి ప్రాహుః శూలో విక్రయ ఉచ్చతే" అని. "అట్ట"మనగా అన్నము. "శూల" మనగా విక్రయము. అన్నము విక్రయించు యిల్లని యర్థము. దీని ననుసరించి అట్టశూలములను పేరుతో సంస్కృత వాఙ్మయములో "హోటలు" గూడు కట్టుకొన్నటుల యూహింతము.

కాని ఆ యట్టశూలములు (హోటళ్ళు) చాల అరుదుగా ఉండేవని మాత్రము చెప్పక తప్పదు. కారణము ఊరూర ఉపకారభావముగల సంపన్నులుండేవారు; వారు ఆతిథ్యమిచ్చుటగాని, అన్నసత్రము పెట్టుటగాని, చేసేవారు. కనీసము చలివేంద్రమునైన, ప్రజోపకారముకోసము పెట్టెడివారు. అందుచే హోటలు పెట్టినను గిట్టుపాటుండేది కాదేమో!

పద్దెనిమిదవ శతాబ్దినాటికిని అన్నదానసత్రము లున్నటుల యూహించవచ్చును. పదునెనిమిదవ శతాబ్దిలోనున్న దంతులూరు బాపరాజుగారు వ్రాసిన "మార్త్రిత్రయో పాఖ్యానము"లో—

సీ॥ ఆజ్యప్రవాహోఽయ మద్భుతం వితనుతే
సూపస్య సౌవర్ణరూప మస్తి
శాకాస్సమీచీన పాకాస్సమానతే
భక్ష్యాళి శర్కరా పరిచితాని
పాయసమాధురీ పరమేశ్వరో వేద
జయతి రసావళీ సౌష్ఠవేన
శాల్యన్నధవలిమా శక్యతే వగదితుం
దధి సుధామాధురీ మధికరోతి
యనుచు...... ......... 
రమణ నర్పించు నన్న సత్రములయందు-

అనుచు కవి తన కృత్యాదిలో వర్ణించియున్నాడు. ఈ అన్నసత్రము కేవలము అగ్రజాతికే యని మన మూహింపవచ్చును; లేదేని తొలి సీసపాదము నాజ్యసూపములతో ప్రారంభము కాదుగదా.

ఉచితాన్నసత్రములలో పొట్ట గడచుచుండగా హోటలుకు వెళ్ళవలసిన యవసరమేమి యనరాదు - రాచకార్యములు కలవారికి అన్నసత్రము లుపయోగపడవు. అందుచే రాచవారికి హోటలే యవసరము. అందుచే "ఆంధ్ర"లో "వంట పూటిల్లు" కావలసి వచ్చినది.

"వంటకు పూటపడినదిగాన వంట పూటిల్లు" అనియా, లేక "పూటకు పూట వండిపెట్టు ఇల్లు కాబట్టి వంట పూటయిల్లు" అనియా, వంటకై పుట్టబడిన యిల్లు కాబట్టి వంటపూట (పుట్ట) యిల్లు అనియా, అనే శబ్దోత్పత్తి విచారణ మనావశ్యకము.

పూట కూళిల్లునే "వంట పూటిల్లు" "వంట

కూలిల్లు" అని తెలుగు పద్యాలు నామకరణము చేసినవి. ఈ వంట పూటిల్లు (హోటలు) కాకతీయ సామ్రాజ్య రాజధానియగు ఓరుగల్లు నగరములో నగరమధ్యలో నున్నటుల తెలియుచున్నది. ఇది పద్నాలుగో శతాబ్దపునాటి మాట. ఆ నాడు హోటలున్నటుల క్రీడాభిరామము సాక్ష్యమిచ్చుచున్నది:

"కప్పురభోగివంటకము కమ్మని గోధుమ
పిండి వంటలున్
గుప్పెడు పంచదారయును క్రొత్తగ కాచిన
ఆవునేయి పెస
రప్పును కమ్మనల్లనటి పండును నాలుగు
నైదు నంజులున్
లప్పలతోడ గొమ్మెరుగు లక్ష్మణ యజ్వల
యింట రూకకున్"

రాజధానీ నగరములో బహుశః రూకకు (యనగా ఇప్పటి రు 0-5-4 అనుకుందును) ఎంత చక్కని భోజనము లభించెడిదో చూచితిరా! నాలుగైదు పచ్చళ్ళ (ఆంధ్రుల ప్రత్యేకత) పెసరపప్పు, తీపి, గోధుమపిండితో చేసిన పిండివంటలు, ఫలరసములతో జిహ్వకు తృప్తికలిగించు భోజనము పెట్టు హోటలున్నటుల కవిసార్వభౌముడైన శ్రీనాథుడంతటికవి సాక్ష్యమిచ్చుచున్నాడు.

ఆ నాటి పూటకూలిల్లు తిండికే కాదు శ్రమను పోగొట్టి హాయినిచ్చే అంత మనోజ్ఞముగనుండేదట. కదిరీపతి తన శుకసప్తతిలో

గీ॥ కంటి పథికజనాహ్వానకారి మృదుల
వాత పోత చలత్పట కేతనాంక
మై, మదీయ శ్రమచ్ఛిదాహారి యగుచు
నలరు నొకవంటకూలి యొయ్యారియిల్లు.

అన్నాడు.

"మృదుల వాతపోతచలత్పట కేతనాంక" మనుటచే ఆహోటళ్లు చక్కనిగాలితో వీచెడి సౌధరాజాలని, జండాలతో నిండియుండేవని భావించాలి.

ఈనాడు హోటళ్ళలో వినవచ్చే సంగీతము ఆనాడును వినపడుచున్నది. అందుచే కదిరీపతి

సీ॥ హాయిపుట్టించె సద్యఃకల్పితానల్ప
రసపూర్ణగాథా దురంతపటిమ
రక్తికల్పించె ధారాళ వాచాసుధా
మాధురీధుర్య సంగీతరీతి
తెలియచేసె ననేకదేశ సభాంతరా
రాళి కాంతర నికరప్రపంచ
మస్ఫురంబొసగె శబ్దార్థవైచిత్రి
నిబంధనోజ్వల గద్యపద్యసమితిఁ
దద్గృహాంలకన్న కల్పతావిహీయ
మాన సోమ సమానీతులైన పథిక
కథక, గాయక, చారు సత్కవులయూదక
పూర్వగంతక సల్లాపములు నరేంద్ర.

అన్నాడు. నేటి హోటలువలె రోగాలయముగాక, పథికులతో, కథకులతో, గాయకులతో, వైదేశికులతో, సత్కవులతో, నిండియున్నటులతోచుచున్నది.

భోజనహోటలున్నను లేకున్నను సోడాకొట్టు లేనిదే రోజుగడవని వారనేకులు. ప్రబంధములలో సోడాలేకున్నను దానికి బదులు శీతలపానీయములున్నవి. అయ్యలరాజు నారాయణామాత్యుడు వ్రాసిన హంసవింశతి రెండవ యశ్వాసములో

సీ॥ లవణ శుంఠీ జంబల రసానుయుక్తమౌ
నీరుమజ్జిగ కుండ బారు లలర
లఘువృత్తైలానూన లలితసౌరభమిశ్ర
శీతల జలకుంభ జాతమమర
జీరక కైడర్య చారు గంధములాలుకు
పలుచని యంబళ్ళ పట్లుతనర
రవయుప్పు నీరుల్లి రసమునించినకోళ్లు
గంజికాగులగుంపు కడురహింప

గీ॥ గంధ బర్హిష్ఠ లామజ్జక ప్రశస్త
కాయమాన ముహుర్ముహు రాయమాన
మంద పవనమానఘనసార బృందవేది
కాలయ వితాన పానీయశాల యొప్పె.

దీని ననుసరించి, గంజి, అంబలి, నీరుమజ్జిగ, చల్లని మంచినీరు, ఈ నాలుగుగల చలివేంద్రలుండేవి. కాని ఆ నీరుమజ్జిగను ఆ మంచినీళ్ళను తయారుచేయుటలోని సువాసన ద్రవ్యాల "ఘుమఘుమ"లు చెప్పుకోతగినవిగయున్నవి. ఆనాటి చలివేంద్రలు, ఈనాటి సోడాకొట్టులు శీతల పానీయములొసగునవియే.

కాని భేదమొకటే: చేతులో పైసానుచూచి యిచ్చువాడీనాటి సోడా కొట్టువాడు; ఆనాటి చలివెంద్రదారు డుచితముగపిలచి శీతలపానీయములిచ్చి సేదతీర్చి పంపెడివాడు. ★

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, Apr 1954

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.
Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/